సాక్షి నంద్యాల
గురువారం, 5, అక్టోబర్, 2023



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి, ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



8న ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): పగిడ్యాల జెడ్పీ హైస్కూల్ మైదానంలో జూనియర్ స్థాయి ఖోఖో జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 8న నిర్వహించనున్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులు.



ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుదామని దిశ కమిటీ చైర్మన్ ఎంపీ పోచా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 8లో▸

న్యూస్‌రీల్

ఆశాజనకంగా ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): స్థానిక టెక్కెలోని మిర్చి మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. బుధవారం సూపర్–10, తేజ్ రకాలకు సంబంధించి కొనుగోళ్లు జరిగాయి. సూపర్–10 రకం జనరల్ గరిష్ట ధర క్వింటా రూ.23,500, కనిష్ట ధర రూ.19,800, మోడల్ ధర క్వింటా రూ.22,000గ పలికింది. ఇదే రకం తాలు కాయ గరిష్ట ధర క్వింటా రూ.11,800, కనిష్ట ధర క్వింటా రూ.10,400, మోడల్ ధర క్వింటా రూ.11,000గా నమోదైంది. ఇక తేజ్ రకం మిర్చి క్వింటా గరిష్ట ధర రూ.23,000, కనిష్ట ధర క్వింటా రూ.19,600, మోడల్ ధర క్వింటా రూ.20,000 పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

98.21 శాతం పింఛన్ పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. జిల్లాలో 2,23,208 మంది పెన్షన్‌దారులుండగా బుధవారం సాయంత్రం వరకు 2,19,220 మందికి (98.21 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్ల పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందవచ్చునన్నారు.

కాన్వొకేషన్ దరఖాస్తుకు నేడు ఆఖరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాల్గవ కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గురువారం వరకు గడువు ఉందని వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. సాంకేతిక సమస్యలు ఉంటే సాయంత్రం 5 గంటల్లోపు వర్సిటీ అధికారులను సంప్రదించాలన్నారు.

ముఖ గుర్తింపు ద్వారా పింఛను

కర్నూలు(అగ్రికల్చర్): 60 ఏళ్ల పైబడి వేలిముద్రలు, ఐరీష్ నమోదు కాని పింఛనుదారులు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను తీసుకోవచ్చని డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ నాగశివలీల తెలిపారు. ఇతర కేటగిరీలకు చెందిన పింఛనుదారులు విధిగా మూడు సార్లు వేలిముద్రలు, ఐరీష్ నమోదుకు ప్రయత్నం చేయాలన్నారు. మూడు సార్లు కూడా ఫెయిల్ అయితే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,47,021 పింఛన్లు ఉండగా 2,42,413 మందికి పింఛన్లు అందించారు. 98.13 శాతం పంపిణీ పూర్తయింది.
- నంద్యాల జిల్లాలో 2,23,210 పింఛన్లు ఉండగా 2,19,382 పింఛన్లు పంపిణీ చేశారు. 98.29 శాతం పూర్తయింది.
- ఇప్పటి వరకు పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా 9, నంద్యాల జిల్లా 6వ స్థానంలో నిలిచాయి.

'ఈ–కేవైసీ'కి ప్రత్యేక స్లాట్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ–కేవైసీలో సర్వర్ సమస్యలను అధిగమించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక స్లాట్‌ను అమలులోకి తెచ్చింది. ఉదయం 6 గంటల నుంచి 2 గంటల 13 జిల్లాల్లో, మిగిలిన 13 జిల్లాలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు స్లాట్ ఇచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రైతులతో ఈ–కేవైసీ చేయించాల్సి ఉంది. స్లాట్ ఇవ్వడంతో సర్వర్‌పై ఒత్తిడి తగ్గుతుందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఈ నెల 8వ తేదీలోపు వీఏఏ, వీఆర్‌వో అథెంటికేషన్, రైతుల ఈ–కేవైసీతో సహా మొత్తం ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. తదుపరి రబీ పంటల నమోదు కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు.

ఎర్ర బంగారం

- జిల్లాలో 46 వేల ఎకరాల్లో మిర్చి సాగు
- సాధారణ సాగుకు రెట్టింపు స్థాయిలో పెరిగిన విస్తీర్ణం
- గత ఏడాది లాభాలు వరించడంతో సాగుపై రైతుల ఆసక్తి



కోవెలకుంట్ల సమీపంలో సాగు చేసిన మిరప పంట

కోవెలకుంట్ల: గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులకు అన్ని విధాలా కలిసొచ్చింది. ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం, మార్కెట్‌లో మంచి ధర పలకడంతో రైతులు లాభాలు గడించారు. అదే ఊపుతో ఈ ఏడాది మిరప సాగుపై ఆసక్తి చూపారు. సాగుకు ముందే వాతావరణం అన్ని విధాలా అనుకూలంగా మారడంతో విస్తారంగా సాగైంది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 24వేల ఎకరాల్లో మిరప సాగు సాధారణ విస్తీర్ణం. కాగా ఆయా మండలాల్లోని బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా ఇప్పటికే 46 వేల ఎకరాల్లో సూపర్–10, తేజ, డబ్బీ బ్యాడీ, తదితర రకాలకు చెందిన మిరప సాగైంది. మిరప నాట్లు వేసిన వారం రోజులకే జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురియడంతో మిరప కళకళలాడుతోంది. సాగుకు గడువు ఉండటంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే సూచనలున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రెట్టించిన ఉత్సాహంతో..

ప్రకృతి కరుణిస్తే అత్యధికంగా లాభాలు గడించవచ్చుననే లక్ష్యంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో మిరప సాగు చేశారు. జిల్లాలోని ప్రతి సబ్ డివిజన్లలో సాధారణ సాగుకు మించి మిరప సాగు చేయడం విశేషం. జిల్లాలో సాధారణ సాగు 9,604 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 18,519 హెక్టార్లు వేసి రికార్డు సృష్టించారు. గత ఏడాది జిల్లాలోని ఆయా మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 7,141 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా 14,467 హెక్టార్లలో వేశారు. ఈ ఏడాది జిల్లాలోనే అత్యధికంగా స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో మిర్చి సాగు చేశారు. సాధారణ సాగు 3,552 హెక్టార్లు కాగా 7,540 సాగు చేశారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే గత ఏడాది గిట్టుబాటు ధర రైతులను గట్టెక్కించింది. క్వింటా ఎండు మిరపకాయలు రూ. 22 వేల నుంచి రూ. 24 వేలు ధర పలికింది. గత ఏడాది మద్దతు ధరతో రైతులకు ఆదాయం చేకూరింది. దీంతో ఈ ఏడాది మిరప సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

జిల్లాలో సబ్ డివిజన్ల వారీగా మిరపసాగు వివరాలు

సబ్ డివిజన్	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగు విస్తీర్ణం
కోవెలకుంట్ల	3,552	7,540
నంద్యాల	3,081	5,395
నందికొట్కూరు	1,047	2,559
ఆళ్లగడ్డ	934	1,532
ఆత్మకూరు	880	1,240
డోన్	110	253
	9,604	18,519

మిర్చియార్డు ఏర్పాటుతో తొలిగిన కష్టాలు

ఎండు మిర్చిని అమ్ముకునేందుకు జిల్లాలో యార్డు సౌకర్యం లేకపోవడంతో గత ఏడాది వరకు రైతులు 300 కిమీ దూరంలో ఉన్న గుంటూరు మిర్చి యార్డుకు తరలించి విక్రయాలు జరపుతున్నారు. 8 టన్నుల దిగుబడులను తరలించే మినీ లారీకి రూ. 16,500, 10 టన్నుల టర్బోలారీకి రూ. 18,500 ప్రకారం బాడుగ చెల్లించాల్సి ఉంది. అనివార్య కారణాలతో దిగుబడులు తీసుకెళ్లిన రోజు విక్రయాలకు బ్రేక్ పడితే రెండు, మూడు రోజులు వేచి ఉండక తప్పదు. అందుకు అదనపు ఖర్చులు తడసి మోపెడవుతున్నాయి. మిరప రైతు కష్టాలు గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఏడాది నంద్యాల జిల్లా కేంద్రంలో మిర్చియార్డు ఏర్పాటు చేసింది. దీంతో మిర్చి విక్రయ కష్టాలకు చెక్ పడటమే కాకుండా దళారుల దందాకు అడ్డుకట్ట పడింది. 29 మండలాలు ఉన్న నంద్యాల జిల్లా ఆయా మండలాలకు 20 నుంచి 30 కి.మీ దూరంలోనే ఉండటంతో దిగుబడులను తరలించేందుకు సులభతరం కావడమే కాక బాడుగ, ఖర్చులు పోవడంతో రైతులు మిర్చి సాగువైపు దృష్టి సారించారు. ఈ ఏడాది మిరప సాగుకు కౌలు ధరలు అమాంతం పెరిగాయి. ఎకరా రూ. 40 వేల నుంచి రూ. 60 వేల వరకు కౌలు చెల్లించి రైతులు ఎర్రబంగారం సాగు చేయడం గమనార్హం.

1.92 ఎకరాల్లో సాగు చేశా



ఈ ఏడాది 1.92 ఎకరాల సొంత పొలంలో సూపర్10 రకానికి చెందిన మిరప పంట సాగు చేశాను. పైరు నెల రోజుల దశకు చేరుకుంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సేద్యాలు, తదితర పెట్టుబడుల రూపంలో ఇప్పటి వరకు రూ. 40 వేలు వెచ్చించాను. వాతావరణం అనుకూలంగా మారటంతో పైరు ఆశాజనకంగా ఉంది.

– కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

గతేడాది మంచి దిగుబడులు



గత ఏడాది ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాను. మొదట్లో వర్షాభావం, పంట చేతికందే తరుణంలో అధిక వర్షాలతో దిగుబడులు కాస్త తగ్గాయి. మార్కెట్‌లో క్వింటా రూ. 24వేలు ధర పలకడంతో పెట్టుబడులు పోను నికర ఆదాయం చేకూరింది. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను.

– చెన్నయ్య, రైతు, ఉయ్యాలవాడ

సూచనలు ఇస్తున్నాం



స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు ఆయా మండలాల్లో 7,540 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ఇటీవల విస్తారంగా వర్షాలు కురియడంతో మిరప ఆశాజనకంగా ఉంది. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేస్తున్నాం. సస్యరక్షణ చర్యలు చేపట్టి చీడపీడలను అరికడితే మంచి లాభాలు పొందవచ్చు.

– ధరణి, ఉద్యానవన శాఖ అధికారిణి, కోవెలకుంట్ల

నాగార్జున విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పరిశీలన



విద్యుత్ ఉత్పత్తి వివరాలు తెలుసుకుంటున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

జూపాడుబంగ్లా: నాగార్జున విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. కంపెనీ మేనేజర్ వెంకటరమణ, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర్లు జేసీకి కంపెనీలో విద్యుత్ ఉత్పత్తి, నీటివాడకం వివరాలను మ్యాప్ ద్వారా వివరించారు. విద్యుత్ ఉత్పత్తి చేసే జనరేటర్లను చూపించి వాటి పనితీరు గురించి తెలియజేశారు. 2014 నుంచి కంపెనీ అనుమతులను ఎందుకు రెన్యూవల్ చేయించుకోలేదని జేసీ ప్రశ్నించగా దరఖాస్తు చేసుకుంటున్నామని తెలిపారు. కంపెనీ పరిధిలో 7.73 ఎకరాల భూములుండగా అందులో జూపాడుబంగ్లా మండల రెవెన్యూ పరిధిలో 6.41 ఎకరాలు, పాములపాడు మండల రెవెన్యూ పరిధిలో 1.32 ఎకరాలున్నట్లు ఆయా మండలాల తహసీల్దార్లు పుల్లయ్యయాదవ్, రత్నరాధిక తెలిపారు. నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహిస్తున్నారా అంటూ జేసీ వాటిని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీటీ నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వో మాధవి పాల్గొన్నారు.

శ్రీశైలానికి నిలిచిన వరద ప్రవాహం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలజలాశయానికి ఎగువ ప్రాజెక్టులైన జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం నిలిచిపోయింది. మంగళవారం నుంచి బుధవారం వరకు దిగువ ప్రాంతాలకు జలాశయం నుంచి 5,293 క్యూసెక్కుల నీరు విడుదలైంది. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో స్వల్పంగా 0.587 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 1,104 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 1000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,360 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 95.1368 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటి మట్టం 856.20 అడుగులకు చేరుకుంది.

విత్తన కొరత లేకుండా చర్యలు

- రాష్ట్రంలోని 16 ఫారాల్లో మూలవిత్తనాల సాగు
- తంగడంచ ఫారంలో నిరుపయోగ భూములను అభివృద్ధి చేస్తాం
- వ్యవసాయశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ వినయ్‌చంద్, జాయింట్ డైరెక్టర్ కృపాదాస్



ఫారం భూములను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు

జూపాడుబంగ్లా: రాష్ట్రంలో విత్తనాల కొరత లేకుండా రైతులకు అవసరమైన మేర ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ వినయ్‌చంద్, జాయింట్ డైరెక్టర్ కృపాదాస్ అన్నారు. బుధవారం వారు తంగడంచ ఫారం భూములను పరిశీలించారు. ఫారం ఏడీఏ అరుణలత, సర్వే అధికారులు భూ వివరాలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఎక్కువగా పత్తి, మిరప, జొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు, కూరగాయల సాగుకు హైబ్రీడ్ రకాల విత్తనాలు వినియోగిస్తున్నారన్నారు. వేరుశనగ, పప్పుశనగ, తృణధాన్యాల సాగుకు మూలవిత్తనాలు వాడుతున్నారని చెప్పారు. అయితే, రైతులకు అవసరమైన విత్తనాలను పూర్తి స్థాయిలో అందించేందుకు రాష్ట్రంలోని 16 ఫారాల్లోని భూముల్లో ఫౌండేషన్ సీడ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. తంగడంచ ఫారం భూములు అన్ని రకాల మూల విత్తనాల ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 624 ఎకరాల ఫారం భూములను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసి వాటిల్లో ఫౌండేషన్ సీడ్స్ ఉత్పత్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, ఏపీఏఓ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్, ఏఓలు కృష్ణారెడ్డి, కిశోర్, నిర్మల, తేజశ్విని, ఫారం సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- సంసద్ ఆదర్శ గ్రామ యోజన పనులపై సమీక్షలో ఎంపీ పోచా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల: సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద జిల్లాలోని ఐదు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో సంసాద్ ఆదర్శ గ్రామ యోజన పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ శామూన్‌తో కలిసి ఎంపీ సమీక్షించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, తొగురు ఆర్థర్ హాజరైన ఈ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ నంద్యాల మండలంలో చాబోలు, జూపాడు బంగ్లా మండలంలో పారుమంచాల, ఉయ్యాలవాడ మండలంలో బోడెమ్మనూరు, గోవింద పల్లె, కోవెలకుంట్ల మండలంలో రేవనూరు గ్రామాలు సంసద్ ఆదర్శగ్రామ యోజన కింద ఎంపికయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. పార్లమెంట్ నిధుల కింద 101 పనులు మంజూరయ్యాయని, వాటి పూర్తికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపి లాడ్స్ కింద చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, కచ్చా రోడ్లు, వంతెన నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పీడీ రామచంద్రా రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెడ్పీచైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- రాయమాల్పురంలో రూ. 4.41 కోట్లతో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్
- కార్యక్రమాన్ని వీక్షించిన కలెక్టర్, జెడ్పీచైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నంద్యాల: ఎన్నో పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో ఒకేసారి ఏర్పాటు చేయనున్న 13 సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లకు బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందులో నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో రూ.4.41 కోట్లతో ఏర్పాటు చేసే యూనిట్ కూడా ఉంది. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా సాగిన ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.పి.నాగిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, ఏపీఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, ఫుడ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగరాజు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ పూర్తయితే చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచివని, ప్రతి ఒక్కరూ వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చిరుధాన్యాలు ఎంతో తోడ్పడుతాయన్నారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లా చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రసిద్ధి అని చెప్పారు. జిల్లాలో చిరుధాన్యాల సాగు రైతులను ప్రోత్సహించేందుకు సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నంద్యాల ఎమ్మెల్యే శిల్పా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు.

ఆన్‌లైన్ కేటుగాళ్లు!

- పార్ట్ టైం ఉద్యోగాలు, ఈజీమనీ పేరుతో వల
- ముందుగా ఆశపెట్టి తర్వాత శఠగోపం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు
- మోసపోతే వెంటనే 1930, 9154987034 నంబర్లకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి



సాక్షి, నంద్యాల: ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ మొబైల్ వాడుతున్నారు. దీనికి తోడు డేటా చవకగా లభిస్తుండడంతో వినియోగదారులు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లోనే గడుపుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, టెలీగ్రాం, ఇన్‌స్టాగాం ఇలా పలు సామాజిక మాధ్యమాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. పెరిగిన ఆన్‌లైన్ వినియోగం కేటుగాళ్లకు వరంలా మారింది. ఇప్పటికే కొందరు ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో నకిలీ ఖాతాలను తెరిచి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. మరికొంతమంది కేటుగాళ్లు ఈజీమనీ, పార్ట్‌టైం ఉద్యోగాలు ఎరవేస్తున్నారు. నమ్మి వారు పంపే లింక్‌లపై క్లిక్ చేయగానే మన ఖాతాల్లో ఉన్న డబ్బు మాయమైపోతుంది.

☛ డోన్‌కు చెందిన ఓ మహిళకు ఇటీవల ఓ నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పాన్‌కార్డు వివరాలు చెప్పి ఈ–కేవైసీ చేయాలని నమ్మించారు. తర్వాత ఆమె మొబైల్‌కు ఐసీఐసీఐ బ్యాంక్‌వీ1 పేరుతో ఓ లింక్‌ను పంపించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మీ బ్యాంకు డిటైల్స్ అన్నీ అందులో ఎంటర్ చేయాలని సూచించడంతో ఆమె అలాగే చేసింది. కట్ చేస్తే ఆమె ఖాతాలో ఉన్న రూ.13,67,900 సెకండ్లలో ఖాళీ అయ్యింది.

☛ బండి ఆత్మకూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ చేసే వారు కావాలని వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ప్రీపెయిడ్ ఇన్వెస్ట్‌మెంట్ టాస్క్ పేరుతో రూ.1000కి రూ.400 లాభం వస్తుందని నమ్మించారు. చెప్పినట్టే కొద్ది రోజులు ఆదాయం చూపించారు. తర్వాత ఎక్కువ డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపించారు. అతను ఏకంగా రూ.14,80,000 మొత్తాన్ని జమ చేశారు. లాభాలు ఇవ్వకపోగా మరో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇలా వీరిద్దరే కాదు అనేక మంది ఆన్‌లైన మోసాల బారిన పడుతున్నారు. కేటుగాళ్ల మాయమాటలు నమ్మి ఆర్థికంగా నష్టపోతున్నారు.

చదువుకున్న వారే బాధితులు !

నంద్యాల జిల్లాకు సంబంధించి సైబర్ మోసాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ అక్కడక్కడ కొందరు మోసపోతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు డోన్, బండి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే రెండు ఆన్‌లైన్ మోసాలు జరిగాయి. ఈ రెండు ఘటనల్లో బాధితులు ఉన్నత చదువులు చదువుకున్న వారే.

ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి

సైబర్ క్రైంలో మోసపోయామని తెలుసుకున్న వెంటనే బాధితులు 1930, 9154987034 నంబర్లకు ఫిర్యాదు చేయాలి. ఏమాత్రం ఆలస్యం చేసినా సొమ్మును రికవరీ చేయడం కష్టమవుతుంది. పై రెండు ఘటనల్లో బాధితులు త్వరగా మేలుకోవడంతో కొంతవరకు డబ్బులు తిరిగివచ్చాయి. డోన్‌కు చెందిన మహిళకు సంబంధించి రూ. 3,32,500ను పోలీసులు రికవరీ చేశారు. అలాగే బండి ఆత్మకూరుకు చెందిన ఘటనలో పూర్తి మొత్తాన్ని రికవరీ చేశారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

పార్ట్‌టైం జాబులు, బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయ్యిందని, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకునేందుకు ఈ కింది లింక్‌పై క్లిక్ చేయండి అంటూ వచ్చే మెసేజ్‌లను నమ్మకండి. అలాగే ఫ్రీ గిఫ్ట్‌ల పేరుతో మోసగాళ్లు వల వేస్తారు. లోన్ యాప్‌లు, ఉద్యోగ ప్రకటనపై అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసం బారిన పడితే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి.

– కె. రఘువీర్‌రెడ్డి, ఎస్పీ, నంద్యాల జిల్లా

క్లుప్తంగా

అడిగిన వారందరికీ 'ఉపాధి'



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ద్వారా ఉపాధి హామీ పథకం కింద పని కలిస్తామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద గతంలో జరిగిన పనులు, వేతనాలు, ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ.. ఏడాదికి 100 రోజుల పాటు పనిదినాలు కల్పిస్తామని, సగటున రోజువారీ వేతనం రూ.272 లభిస్తుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా ఆరు నెలలు మిగిలి ఉందని, కూలీలు మిగిలిన పనిదినాలు ఉపయోగించుకోవాలని కోరారు. గాంధీ జయంతి నుంచి 2024–25 సంవత్సరానికి ఉపాధి పనులను గ్రామసభల ద్వారా గుర్తించే ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైందన్నారు. సర్పంచ్ ముత్యాల శైలజ, ఏపీఓ రాజునాయక్, ఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ టీవీ, కెమెరా అమరిక, రిపేరిలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు సీసీ టీవీ, కెమెరా అమరిక, రిపేరీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 13 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు యువకులకు శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 900 0710508 నెంబర్ సంప్రదించాలన్నారు.



ఆహ్లాదాన్ని పంచే హాల్



విశాలమైన పడక గది



సౌకర్యవంతంగా వంట గది



ఆధునిక మరుగుదొడ్డి

పేదల గూడు.. ఇదిగో చూడు

పేదల సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోంది. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా పక్కా గృహాలు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి మూడు విడతల్లో రూ.1.80 లక్షలను ఇస్తోంది. డబ్బులు లేని లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రూ. 35 వేలు రుణం ఇప్పిస్తోంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను రాయితీపై అందజేస్తోంది. అంతే కాకుండా కాలనీల్లో విద్యుత్, రోడ్లు, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. దీంతో లబ్ధిదారులు రెట్టింపు ఉత్సాహంతో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఓర్వకల్లు సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలోని పేదల ఇళ్లు ఇవీ..

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



కరెంట్ సౌకర్యం కల్పిస్తున్న విద్యుత్ సిబ్బంది



దాహార్తి తీరుస్తున్న మంచినీటి ట్యాంకులు



నిర్మాణంలో జగనన్న కాలనీ ముఖద్వారం



అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఇల్లు



అందంగా రూపుదిద్దుకున్న ఇంటికి అమర్చిన విద్యుత్ మీటరు



విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసిన దృశ్యం



ఓర్వకల్లు సమీపంలోని 14 ఎకరాల్లో 260 ఇళ్లతో ఏర్పడిన జగనన్న కాలనీ

రేపటి నుంచి జూనియర్ కళాశాలల క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 6 నుంచి జూనియర్ కళాశాలల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న స్విమ్మింగ్ పోటీలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో, రైఫిల్ షూటింగ్ పోటీలు అశోక్‌నగర్‌లోని ఆర్‌కే అకాడమీలో, 7న రగ్బీ, రోప్ స్కిప్పింగ్ పోటీలు బి.క్యాంప్ బాలికల క్రీడామైదానంలో, 9 న బాస్కెట్ బాల్, టెన్నికాయిట్ పోటీలు సిల్వర్‌జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో, 10న జూడో పోటీలు నందికొట్కూరులోని నంది కళాశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి
- కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై సమీక్షలో దిశ కమిటీ చైర్మన్ ఎంపీ పోచా

నంద్యాల: జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుదామని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో చైర్మన్ అధ్యక్షతన దిశ కమిటీ సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరైన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల కింద మంజూరైన పనులపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ 25 శాఖలకు సంబంధించి 43 సంక్షేమ పథకాల కింద మంజూరు చేసిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, వ్యవసాయం, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య, జాతీయ రహదారులకు సంబంధించి కేటాయించిన పనులు పూర్తి చేస్తే సంబంధిత పథకాల కింద మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కృష్ణా జిల్లా నుంచి రైతు రథం వాహనాన్ని తెప్పించేందుకు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ బుగ్గ నుంచి కైపా ద్వారా గిద్దలూరు వెళ్లే రహదారి పనులు చేపట్టాలని ఆర్అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం కింద గర్భిణులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా ఐప్యాక్ కింద ప్రతిపాదనలు పంపిన రోడ్ల వివరాలు తెలియజేయాలన్నారు. ఓర్వకల్లు, తమ్మరాజు పల్లె మీదుగా వాటర్ పైప్‌లైన్‌లు వెళ్తున్నాయని, నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని సూచించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్ల నియమించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓకు చెప్పారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

ఆలూరు: తల్లిదండ్రులు లేని అనాథ చిన్నారులకు జేసీఎల్ జిల్లా కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి రూ. 10 ఆర్థిక సాయాన్ని అందజేశారు. హాలహర్వి మండలం బాపురం గ్రామానికి చెందిన దంపతులు మంజూనాథ్‌స్వామి, శారదమ్మ ఏడాది క్రితం మృతిచెందారు. వారి పిల్లలు గణేష్, పూజిత అనాథులుగా మిగిలారు. ప్రస్తుతం గణేష్ హాలహర్వి జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి, పూజిత బాపురం గ్రామంలో 7వ తరగతి చదువుతోంది. వీరికి తల్లిదండ్రులు నుంచి, దయాదుల నుంచి ఎలాంటి ఆస్తిపాస్తులు రాలేదు. గ్రామస్తుల సహకారంతో వారు పెరుగుతున్నారు. ఈ విషయం తెలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు, జిల్లా జేసీఎల్ కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి బాపురం గ్రామానికి వచ్చి చిన్నారులు గణేష్, పూజితకు రూ 10 వేలు ఆర్థిక సాయం చేశారు. వీరి చదువుకు భరోసా కల్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జేసీఎల్ జిల్లా కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి

అత్యాధునిక టెక్నాలజీతో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

- 24వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా టెలికాం జీఎం రమేష్

కర్నూలు(రాజ్‌విహార్): అత్యాధునిక టెక్నాలజీతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ భవన్‌లో 24వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాలు చూడకుండా అతి తక్కువ ధరకే బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు అందిస్తోందన్నారు. త్వరలోనే స్వదేశీ టెక్నాలజీతో 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీతో భారత్ ఫైబర్ ఇంటర్నెట్ సర్వీసు అందిస్తున్నట్లు చెప్పారు. మారుమూల ప్రాంతాలకు సేవలందించాలనే లక్ష్యంతో కేవలం రూ.399లకే 30 ఎంబీపీఎస్ స్పీడుతో అపరిమితమైన ఇంటర్నెట్, పట్టణవాసులకు రూ.449కే అందిస్తామన్నారు. ఇటీవలే కొత్తగా ఐపీ టీవీ సర్వీసులు ప్రారంభించామని, ఒకే ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్, వైఫై, టెలిఫోన్, టీవీ సర్వీసులను పొందవచ్చన్నారు. కేవలం రూ.329లకే ఈ ప్యాకేజీ వర్తిస్తుందన్నారు. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ సేవలు పొందుతున్న వినియోగదారులు తమ సిమ్‌లను 4జీగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం స్మార్ట్ లర్నింగ్ యూజింగ్ బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ అనే అంశంపై నిర్వహించిన చిత్ర లేఖనంలో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించారు. మొదటి స్థానం సాధించిన కర్నూలు శ్రీలక్ష్మీ హైస్కూల్ విద్యార్థిని జి.ప్రణితకు రూ.599 ప్లాన్ ఏడాది పాటు ఉచితంగా, ద్వితీయ స్థానంలో నిలిచిన సిస్టర్ స్టాన్సిలాస్ విద్యార్థిని ఎం.సహనకి ఆరు నెలలు, మూడవ స్థానం దక్కించుకున్న శ్రీచైతన్య విద్యార్థిని కె.హర్షితకి మూడు నెలలు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీజీఎం సాయినాథ్, ఏజీఎంలు వెంకటరాములు, శ్రీను నాయక్, మురళీకృష్ణ, వి.జాన్సన్, నారాయణ స్వామి పాల్గొన్నారు.



విజేతలతో బీఎస్ఎన్ఎల్ జీఎం రమేష్

ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన(ఏ గ్రూపు అయినా) మహిళలకు రెండు సంవత్సరాల ఉచిత మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్/ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ కళాశాల కరస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మొత్తం సీట్లు 40 ఉన్నాయని, ప్రవేశం పొందాలనుకునే మహిళలు 2023 డిసెంబర్ 31వ తేది నాటికి 17 సంవత్సరాల వయస్సు నిండి 30 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ htt p://cfw.ap.nic.in నుంచి పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31లోగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు 9848352725, 7416404740 నెంబర్లను సంప్రదించాలన్నారు.


'ఓటు' పాట్లు లేకుండా..

- పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ
- కొత్త కేంద్రాల ఏర్పాటు.. పలు కేంద్రాల పేరు మార్పు
- కుటుంబంలో అందరూ ఒకే చోట ఓటు వేసేలా చర్యలు

కర్నూలు(సెంట్రల్): ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఒక పోలింగ్ కేంద్రంలో కనీసం 900 మంది, అత్యధికంగా 1,500 మంది లోపు ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇదులో భాగంగా జిల్లాలో కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 2,184 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కర్నూలులో 258, పాణ్యంలో 339, పత్తికొండలో 255, కోడుమూరులో 275, ఎమ్మిగనూరులో 271, మంత్రాలయంలో 236, ఆదోనిలో 256, ఆలూరులో 294 చొప్పున ఉన్నాయి. ఎన్నికల సంఘం నూతన నిబంధనలు ప్రకారం కల్లూరు, కోసిగి మండలం కోనమాన్ పేటలో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. పోలింగ్ స్టేషన్లు ఉండే ప్రాంతాన్ని మార్చేందుకు 114, కేంద్రాల పేరు మార్పుపై 328 ప్రతిపాదనలు వచ్చాయి. పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలలు అప్‌గ్రేడ్ కావడంతో వాటి పేర్ల మార్పు కోసం ప్రతిపాదించాల్సి వచ్చింది. పోలింగ్ స్టేషన్ల విలీనానికి జిల్లాలో ఎక్కడా ప్రతిపాదనలు రాలేదు.

అన్ని రకాల సదుపాయాలు

పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అక్టోబర్ చివరి నాటికి నాడు–నేడు పనులు పూర్తయ్యే పాఠశాలలనే పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. పోలింగ్ స్టేషన్లను మ్యాపింగ్ చేస్తున్నారు. దీంతో ఓటరు నేరుగా తన సెల్ ఫోన్‌లోని గూగుల్ మ్యాప్ ద్వారా సులభంగా చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. కేంద్రంలోకి ప్రవేశించిన తరువాత కూడా ఎక్కడా ఎలాంటి అయోమయం లేకుండా లోపలికి, బయటకు వచ్చు మార్గాలను చూపుతూ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద దాని నంబరు, పేరు, పీఎస్ ఆఫీసర్ పేరు రాయించేలా చర్యలు తీసుకుంటున్నారు. కుటుంబసభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఓటరుజాబితా రూపకల్పన నుంచి పోలింగ్ కేంద్రం కేటాయించే వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలి

బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓలు) సమర్థవంతంగా విధులు నిర్వహించి తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై ఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. తగిన డాక్యుమెంట్లు ఉంటనే ఫారం –6,7,8లను డిస్పోజ్ చేయాలన్నారు. చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రం, జాబితాలో కొత్తగా ఓటరుగా చేరాలంటే బర్త్ సర్టిఫికెట్ ఉంటాలన్నారు. జిల్లాకు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు వచ్చినట్లు చెప్పారు. వాటిని ప్రస్తుతం స్కానింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఈనెల 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు వాటిని ఫస్టు లెవల్ చెక్ నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడును ఇన్‌చార్జిగా నియమించినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదనరావు, ఈఆర్‌ఓ రమ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ప్రతిపాదనలు పంపాం

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై దృష్టి సారించాం. జిల్లాలో కొత్తగా రెండు పోలింగ్ స్టేషన్లకు ప్రతిపాదించాం. పోలింగ్ స్టేషన్ల లోకేన్లు, పేర్లు మార్పులపై కూడా పెద్ద ఎత్తున ప్రతిపాదనలు వచ్చాయి. వాటిన్నింటినీ పరిశీలించి ఎన్నికల సంఘానికి పంపుతాం. – డాక్టర్ జి.సృజన, కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి